క్లుప్తంగా

రోడ్డు భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న డీఎం బాలాజీ దయాళ్

ఉరవకొండ: ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రత పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్టీసీ డీఎం బాలాజీ దయాళ్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సభలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ఆర్‌బీవంక స్కూల్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మండలం 74 ఉడేగోళంలోని ఆర్డీటీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన ఏరియా లెవల్ క్విజ్ పోటీల్లో ఆర్‌బీ వంక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గురువారం ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీస్‌లో రాయదుర్గం, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని 5వ తరగతి విద్యార్థులకు తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం, జనరల్ నాలెడ్జ్‌లో క్విజ్ పోటీలు నిర్వహించారు. 50 మందిలో ఆర్‌బీ వంక ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు శ్రావణి, గాయత్రి, ధ్యాన్ చంద్, తేజ యారీనాలు ప్రథమ స్థానంలో నిలిచారు. ఎంఈఓ నాగమణి, ఆర్డీటీ ఏరియా టీం లీడర్ పుల్లారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

సాంకేతికతతో నాణ్యమైన విద్య



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పరమేశ్వర

బొమ్మనహాళ్: సాంకేతికతతో నాణ్యమైన విద్య అందుతుందని సర్పంచ్ పరమేశ్వర అన్నారు. గురువారం మండలంలోని నేమకల్లులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల 5వతరగతిలో ప్రవేశాలకు ఫిబ్రవరి 23లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎన్.సునీత తెలిపారు. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్, ఏపీబీఆర్ఏసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు 1-9-2023 నుంచి 31-08-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. మొత్తం 80 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి సీఈసీ గ్రూపులో 40 సీట్లు, ఎంఈసీ గ్రూపులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఒంటిమిద్దె విద్యార్థులు



విద్యార్థులతోఎస్ఎల్ఎన్ క్లబ్ ప్రెసిడెంట్ గోళ్ల సూరి

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్దెకు చెందిన విద్యార్థులు కిరణ్,చరణ్, వరణ్, నందకిషోర్, రాహుల్, చరణ్, భవ్యశ్రీ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఎల్ఎన్ క్లబ్ ప్రెసిడెంట్ గోళ్ల సూరి, వైస్ ప్రెసిడెంట్ సురేష్, నాయకులు సంజీవ్, శ్రీధర్ తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన జూనియర్ బాలుర హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న

కళ్యాణదుర్గం: అంగన్‌వాడీ సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న హెచ్చరించారు. గురువారం స్థానిక కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లతో సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ రోజూ ఉదయం 9 గంటల లోపే కేంద్రానికి హాజరుకావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రీ స్కూల్ పిల్లలను సెంటర్‌కు జాగ్రత్తగా తీసుకురావాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కళ్యాణదుర్గం రూరల్: రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో ఆవరణలో డాక్టర్ శరత్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రామచంద్ర డిప్యూటీ సూపరింటెండెంట్ ఇందిరమ్మ పాల్గొన్నారు.

ఆసరాతో ఆర్థిక ప్రగతి

- మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి
- చిరు వ్యాపారులతో మహిళల ఆర్థిక పురోగతి
- స్వయం సహాయక సంఘాల బలోపేతానికి సీఎం వైఎస్ జగన్ చేయూత

ఉరవకొండ:



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు సరోజ. కూడేరు మండలం జల్లిపల్లి. ఈమె ప్రతిభా గ్రామ సంఘంలో సభ్యురాలు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అబద్ధపు హామీలను నమ్మింది. రుణమాఫీ కాకపోవడంతో డీఫాల్టర్ అయ్యింది. జగనన్న అధికారంలోకొచ్చిన తర్వాత వైఎస్సార్ ఆసరాతో దాదాపు రూ.90 వేల వరకు మంజూరయ్యింది. కుట్టు మిషన్‌తోపాటు దుస్తులు విక్రయిస్తూ స్వయం ఉపాధి పొందుతోంది. జగనన్న చలువతోనే రుణవిముక్తి అయ్యాయని, సొంతంగా వ్యాపారం చేస్తున్నట్లు ఆమె తెలిపింది.



ఈమె పేరు సరస్వతి. ఉరవకొండ పట్టణానికి చెందిన ఈమె..ఈశ్వరి మహిళా సంఘంలో సభ్యురాలు. బ్యాంకు రుణంతో పాటు ఎస్‌హెచ్‌జీ రుణాలు పొంది సొంతంగా చక్కిల తయారీ మిషన్ కొనుగోలు చేసింది. ఆమె ఉపాధి పొందుతూ సంఘం సభ్యులకు ప్యాకింగ్, తయారీ పనులు కల్పిస్తోంది. తయారు చేసిన సరుకు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి మార్కెటింగ్ చేసుకుంటున్నారు. నాలుగు విడతల్లో వచ్చిన ఆసరా సొమ్ముతో వ్యాపారం మరింత అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతోంది.



ఉరవకొండలో నాల్గో విడత ఆసరా సొమ్మును విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

వైఎస్సార్ ఆసరాతో వ్యాపారాలు

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి పథకాన్నీ మహిళల పేరిట ప్రారంభించారు. మహిళలు వారి కాళ్లపై నిలబడి జీవనోపాధి మెరుగుపరుచుకునేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వం మహిళా సంఘాలను డీఫాల్ట్ గ్రూపులుగా మార్చి ఏ-గ్రేడ్, బీ- గ్రేడ్ సంఘాలను కూడా డీ గ్రేడ్‌కు పడిపోయేలా చేసింది. జగనన్న ప్రభుత్వం ఏర్పాటయ్యాక నాలుగు విడతలుగా ఆసరా సొమ్మును నేరుగా మహిళల ఖాతాలకు జమ చేశారు. మహిళలు కూడా పురుషులతో సమానంగా ఉపాధి అవకాశాలు సొంతంగా సృష్టించుకొని వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు.

నాలుగు విడతల్లో ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా ద్వారా విడుదల చేసిన నగదు వివరాలు

నియోజకవర్గం పేరు	సంఘాలు	సభ్యులు	లబ్ధి (రూ.కోట్లలో)
ఉరవకొండ	3,811	37,291	11 కోట్లు
రాయదుర్గం	3,705	36,892	9 కోట్లు
కళ్యాణదుర్గం	4,061	40,067	13 కోట్లు
	11,577	1,14,250	33 కోట్లు

ఆర్థికంగా ఎదిగాం



ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్న సమయంలో జగనన్న ప్రభుత్వం సంఘాల్లో ఉన్న మహిళలను ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా నాలాంటి వాళ్లకు ఉపాధి మార్గాలు చూపారు. ఆసరాతో పాటు బ్యాంకు రుణాలు పొంది నా కాళ్ల పై నేను నిలబడేలా చేశారు.

– లక్ష్మి, మల్లేశ్వర, ఎస్‌హెచ్‌జీ, ఉరవకొండ

'ఆసరా'తో లబ్ధి పొందా



మహిళలకు వైఎస్సార్ ఆసరాతో జగనన్న ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది. గత ప్రభుత్వంలో రుణమాఫీ హామీ నమ్మి మోసపోయాం. మా సంఘం డీ గ్రేడ్‌కు పడిపోయింది. ప్రస్తుతం జగనన్న రుణమాఫీ సొమ్ము మాకు అందించడంతో సంఘం ఏ గ్రేడ్‌కు చేరేలా సంఘాన్ని బలోపేతం చేసుకున్నాం. జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఇందిర, శ్రీనివాస మహిళా సంఘం, ఉరవకొండ

'దుర్గం'ను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: కర్ణాటక సరిహద్దులో ఉన్న 'రాయదుర్గం' ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, ఎంపీపీ విద్యావతి, జెడ్పీటీసీ మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవ శివప్పతో కలిసి రాయదుర్గం అర్బన్, రూరల్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ డీహీరేహాళ్ మండలం జాజరకల్లు వద్ద ఇప్పటికే రూ.544 కోట్లతో ఇథనల్ ఇంధన తయారీ పరిశ్రమ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ వర్చువల్‌లో శంకుస్థాపన చేశారన్నారు. ప్రత్యక్షంగా 500మంది, పరోక్షంగా 1000 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. తాజాగా బొమ్మనహాళ్, డీహీరేహాళ్, కణేకల్లు, రాయదుర్గం ప్రాంతాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో రూ.10 వేల కోట్లతో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. ఇటీవల 850 మెగావాట్ల ఉత్పత్తికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

వ్యవసాయంలోనూ వినూత్న సంస్కరణలు

వ్యవసాయంలోనూ రైతును లాభసాటి పద్ధతుల్లో మార్చేందుకు వినూత్న సంస్కరణలు తీసుకొస్తామని మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం పునరుద్ధరణలో భాగంగా బీటీప్రాజెక్టుకు నీరు తీసుకొచ్చి రైతు సాగు ప్రయోజనాలను కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు.

పెత్తందార్లపై యుద్ధానికి సమరశంఖం మోగిద్దాం

మంచి జరగాలంటే మళ్లీ ఏపీకి సీఎంగా జగన్ మాత్రమే ఉండాలని మెట్టు గోవిందరెడ్డి అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నిపార్టీలతో పొత్తు పెట్టుకున్న వైఎస్సార్‌సీపీకి ఒరిగేదేమి లేదన్నారు. మోసం, దగా, వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు అని గుర్తుచేశారు. రాప్తాడులో ఈ నెల 18న నిర్వహించనున్న ఎన్నికల సిద్ధం సభకు పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకుడు పొరాళ్ల శివా, మాజీ ఎంపీపీ నాగరాజురెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, పట్టణంలోని వివిధ వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, సర్పంచులు, ఎంపీటీసీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు పట్టం కట్టండి



ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

గుమ్మఘట్ట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డి కోరారు. గుమ్మఘట్ట, గోనబావి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత పార్టీలకతీతంగా కులమత తారతమ్యం లేకుండా అర్హత ఉంటే చాలు..అందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ మునిగిపోయే నావ లాంటిందని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి, కాంట్రాక్టర్ ఆర్టీ కాంతారెడ్డి, ఎస్సీ సెల్‌రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, సర్పంచులు అనిల్‌కుమార్, రమేష్, ఉమేష్, రాజేష్, ఎంపీటీసీ గోవింద, నాయకులు గోనబావి ప్రతాప్‌రెడ్డి, తాళ్లకెర వీరభద్రరెడ్డి, మాజీ కన్వీనర్ అశ్వర్థరెడ్డి, మాజీ సర్పంచ్ చిత్రశేఖరప్ప, రాఘవేంద్రరెడ్డి, అనంతరెడ్డి, కేఎం రాజు, ఖాజాహుస్సేన్, డీలర్లు కురుబ రామాంజనేయులు, జయరామిరెడ్డి, తిమ్మప్ప, నారాయణరెడ్డి, కలుగోడు గోవిందు, హనుమంతు, ఈశ్వరరెడ్డి, సిద్దప్ప, ఈరన్న, తప్పడి శివ, హనుమప్ప పాల్గొన్నారు.

సెక్టార్ ఆఫీసర్లు విధిగా తనిఖీ చేయాలి

- ఆర్డీఓ రాణీ సుస్మిత, డీఎస్పీ బి.శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఆర్డీఓ రాణీసుస్మిత

కళ్యాణదుర్గం: నియోజకవర్గం పరిధిలో నిర్ణయించిన పోలింగ్ స్టేషన్లలో ఏ కొరత ఉండకూడదని, సెక్టార్ ఆఫీసర్లు విధిగా తనిఖీ చేయాలని ఆర్డీఓ రాణీ సుసిత్మ, డీఎస్పీ బి.శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ స్టేషన్లో తాగునీరు, మరుగుదొడ్లు, వెలుతురు, ఫ్యాన్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐలు నాగరాజు, హరినాథ్, చంద్రశేఖర్, ఎన్నికల డీటీ వెంకటేశులు, సెక్టార్, డిపార్ట్‌మెంట్ సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ , తాళ్లకెర, గొల్లపల్లి, కేపీకుంట, గలగల, పైదొడ్డి, సిరిగెదొడ్డి, కేపీ దొడ్డి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ గౌరిదేవి గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్‌లు సక్రమంగా ఉన్నాయా? లేదా అని పరిశీలించారు.కార్యక్రమంలో ఆర్ఐ చంద్ర, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

జోడు లింగాలకు ప్రత్యేక పూజలు

కూడేరు: కూడేరులో ప్రఖ్యాతిగాంచిన శివపార్వతుల జోడులింగాల పుణ్యక్షేత్రంలో గురువారం మాసశివరాత్రి వేడుకల్లో భాగంగా జోడు లింగాలకు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈవేడుకల్లో మండల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో జోడు లింగాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. కార్యక్రమంలో పురోహితులు శివశంకర్ శాస్త్రి , మహేష్, ప్రవీణ్, శివ, బాలాజీ శర్మ, సురేష్ శాస్త్రిలు పాల్గొన్నారు.

పల్లకీ ఉత్సవం

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనులపండువగా సాగింది. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తీర్థప్రసాదాల వినియోగం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఆల్బెండజోల్ మాత్రలు అందించండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న స్పెషలాఫీసర్ తిప్పేస్వామి, ఎంపీపీ పద్మ తదితరులు

బొమ్మనహాళ్: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని మండల స్పెషలాఫీసర్ తిప్పేస్వామి, ఎంపీపీ పద్మ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయలంలో పోస్టర్లు విడుదల చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయమ్మ, వైస్ ఎంపీపీ రమేష్, వైద్యాధికారిణి మల్లీశ్వరి పాల్గొన్నారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కుందుర్పి: మండలంలోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని వైద్యాధికారిణి అనూష సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో నులిపురుగు నివారణ కార్యక్రమంపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రుల్లో ఆల్బెండజోల్ మాత్రలు అందుబాటులో ఉంటాయన్నారు. మండల వ్యాప్తంగా 13,256 మంది పిల్లలకు నులి పురుగు నివారణ మాత్రలు అందజేస్తున్నట్లు తెలిపారు.

- తూముకుంట గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు అనూష , నారాయణస్వామి, సోమశేఖర్ తెలిపారు.

కూడేరు: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రావని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం కూడేరులోని పీహెచ్‌సీలో ఆశా వర్కర్లతో ఆయన సమావేశమయ్యారు. సూపర్ వైజర్లు రవీంద్ర, యశోధ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శరవేగంగా పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గుమిగూడిన లబ్ధిదారులు

కళ్యాణదుర్గం: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో పేదలకు పంపిణీ చేసిన పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతంగా సాగుతున్నాయి. గురువారం వరకు కళ్యాణదుర్గం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో 114 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ రామలక్ష్మిదేవి తెలిపారు.

= జగనన్న కాలనీల్లో పేదల పట్టాల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని ఆర్డీఓ డాక్టర్ రాణీ సుస్మిత సూచించారు. గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం పేదలకు అందించిన పట్టాల రిజిస్ట్రేషన్లపై సబ్ రిజిస్ట్రార్ రామలక్ష్మిదేవితో ఆరా తీశారు. ప్రతి గ్రామ సచివాయంలో రోజుకు కనీసం 20 రిజిస్ట్రేషన్లు టార్గెట్ పెట్టుకోవాలన్నారు.

రిజిస్ట్రేషన్‌లతో అనేక ప్రయోజనాలు

వజ్రకరూరు: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లతో ప్రయోజనం ఉంటుందని ఎంపీడీఓ విజయలలిత అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ సేవలను ఎంపీడీఓ పరిశీలించారు. గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, వీఆర్వోలు అరుణ,నూర్‌మహమ్మద్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

బెళుగుప్ప: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ శంకర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గంగవరం, బెళుగుప్ప గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ రామచంద్ర, ఈఓఆర్‌డీ మాధవరెడ్డిలతో కలిసి డీఎల్‌డీఓ పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు రాజశేఖర్, నగేష్, పంచాయతీ సెక్రటరీలు వెంకటేశులు, జగదీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: జగనన్న ప్రభుత్వం అందించిన ఇళ్ల స్థలాలను త్వరిత గతిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని కళ్యాణదుర్గం ఆర్‌డీఓ రాణిసుస్మిత తెలిపారు. గురువారం ఆమె కుందుర్పి గ్రామ సచివాలయంలోజగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల వేగవంతంపై సమీక్ష నిర్వహించారు. మండలంలో 257 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు పూర్తయినట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు. కార్యక్రమంలో డీటీ తిప్పేస్వామి, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ డిపోలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డీఎం సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరానికి ప్రభుత్వ వైద్యుడు మోహన్‌సాయి హాజరై ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 20 మందిని పరీక్షించి, అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు డీఎం తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఎస్టీయూ అధ్యక్షుడిగా వై.రాజు

కుందుర్పి: మండల ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ శాఖ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు కే.కృష్ణమూర్తి తెలిపారు. అధ్యక్షుడిగా వై.రాజు, ఉపాధ్యక్షులుగా వరలక్ష్మి, సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా రేవన్న, కార్యదర్శిగా బాబు, వీరేష్, ఆర్థిక కార్యదర్శిగా గురుస్వామి కౌన్సిలర్లుగా కృష్ణ మూర్తి, రాధాకృష్ణంరాజు, చెన్నరాయప్ప, హనుమంతప్ప, జే.కృష్ణమూర్తి, మరో 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నీసాలో లిటిల్ రోజెస్ విద్యార్థుల ప్రతిభ

కళ్యాణదుర్గం: నీసా (నేషనల్ ఎనలిటికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్)- 2023 ఫలితాల్లో లిటిల్ రోజెస్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ విషయాన్ని విద్యా సంస్థల కార్యదర్శి ఎం.రమేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన వారిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న డి.షభానా ఫర్వీన్ (9వ ర్యాంకు), 7వ తరగతి చదువుతున్న ఎం.జోహాఫిర్‌దోస్ (6వ ర్యాంక్), 8వ తరగతి చదువుతున్న టి.అశ్వినిశ్రీకి (7వ ర్యాంక్), డి.దివ్య శ్రీకి (9వ ర్యాంక్)లు వచ్చినట్లు ఆయన తెలిపారు. గత మూడేళ్లుగా పాఠశాల నుండి ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లలో సైతం సీట్లు సాధించినట్లు ఆయన తెలిపారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

శెట్టూరు: మండలంలోని చింతర్లపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కణేకల్లు: కర్ణాటకలోని బళ్లారి నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తున్న యర్రగుంటకు చెందిన ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకొని, వారి నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రుణాలు రెన్యూవల్ చేయించుకోండి

కణేకల్లు: కణేకల్లు పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)లో పంట రుణాలను రెన్యూవల్ చేయించుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, సీఈఓ హనుమంతులు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. పీఏసీఎస్ ఖాతాదారులకు పంట రుణాలు రెన్యూవల్ చేస్తున్నట్లు వారు తెలిపారు.

సర్మస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామి వారాన్ని పురస్కరించుకొని భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి తరలివచ్చారు.

ప్రభుత్వాస్పత్రికి ఎలక్ట్రికల్ కాటెరీ మిషన్

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి అత్యాధునిక ఎలక్ట్రికల్ కాటెరీ మిషన్‌ను గవిమఠం ఉత్తరాధికారి శ్రీకరిబసవరాజేంద్రస్వామి చేతుల మీదుగా డీసీహెచ్ఎస్ పాల్‌రవికుమార్‌కు గురువారం అందించారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ ఎల్లోజీ, వైద్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

రాయదుర్గంటౌన్: రోడ్డు భద్రతా నియమాలను వాహనదారులు ప్రతి ఒక్కరూ పాటించాలని ఆర్టీసీ డీఎం సురేష్‌బాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యంగా యువత వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండడం, ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు.

సీఎం జగన్‌తోనే న్యాయం

అనంతపురం రూరల్: నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు, యల్లనూరు ప్రసాద్ పేర్కొన్నారు. కులవృత్తినే నమ్ముకొని జీవిస్తున్న తమకు ఆర్థికంగా బలోపేతం చేయడానికి పథకాలు అందించడంతో పాటు రాజకీయ ప్రాధానత్య కల్పించారన్నారు. గురువారం బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.

సామాజిక తనిఖీలకు సహకరించాలి

వజ్రకరూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జరుగనున్న సామాజిక తనిఖీలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ విజయలలిత, ఎస్ఆర్పీ లోకేష్ సూచించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సామాజిక తనిఖీలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి సామాజిక తనిఖీలు క్షేత్ర స్థాయిలో ప్రారంభం కానున్నట్లు వారు వెల్లడించారు. తనిఖీల అనంతరం గ్రామ, మండల స్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏపీఓలు లక్ష్మీబాయి, వెంకటేష్ నాయక్, పీఆర్ ఇంజనీర్‌మణిభూషణ్, డీఆర్పీలు, ఉపాధి సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కాన్పు సురక్షితం

వజ్రకరూరు: గర్భిణులు ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు చేయించుకోవాలని వైద్యులు సర్దార్‌వలి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక వైద్యాధికారి సాహితి, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు సుశీల, నాగశంకర్, హెచ్ఈ సత్యనారాయణ, ఏఎన్ఎంలు,ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

బొమ్మనహాళ్: అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీపీ పద్మ అన్నారు. గురువారం మండల స్పెషలాఫీసర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండల అధికారులు 12 గంటల వరకు సమావేశానికి హాజరుకాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే లక్ష్యం నెరవేరుతుందన్నారు. గోవిందవాడలో సురక్షిత మంచి నీరు అందించాలని ఎంపీటీసీ ప్రమీలమ్మ కోరారు. కల్లుదేవనహళ్లి ప్రభుత్వ పాఠశాల నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వైస్ ఎంపీపీ రమేష్ కోరారు. నేమకల్లులో కూడా నాడు-నేడు పనులు పూర్తి చేయాలని సర్పంచ్ పరమేశ్వర కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయమ్మ, వైస్ పశువైద్యాధికారి వెంకట్‌రెడ్డి, వైద్యాధికారిణి మల్లీశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చైతన్య కుమార్, ఏఓ సాయికుమార్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా ఎస్.షేక్షావలి

వజ్రకరూరు: మండల ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈగా ఎస్.షేక్షావలి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంతకల్లు ఏడీఏ కార్యాలయంలో జేఈగా విధులు నిర్వహిస్తున్న ఎస్.షే క్షావలిని వజ్రకరూరు మండలం ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈగా నియమించారు. గురువారం ఆయన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఏఈకి లైన్ ఇన్‌స్పెక్టర్లు, జేఎల్ఎంలు, ఆపరేటర్లు స్వాగతం పలికారు.

వంద రోజులు పనులు కల్పించాలి

బెళుగుప్ప: గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద వందరోజులు పనులు కల్పించాలని ఎంపీడీఓ సుబ్బరాజు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలతో సమావేశాన్ని నిర్వహించారు. పనులకు వెళ్లే కూలీలకు వందరోజులు తప్పకుండా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ భాగ్యలక్ష్మి, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.